## గట్లయితే మేం వలసలు పోవాల్సిందే..



హసన్‌పర్తి: కాంగ్రెస్ పాలనల కరెంటు సక్కగ రాక రైతులం 50 ఏండ్లు గోసపడ్డం. నీళ్లు లేక పంటలు ఎండి అప్పుల పాలై వడ్డీలు కట్టక భూములు అమ్ముకున్నం. రైతులకు ఎరువులు, విత్తనాలు దొరికేవికావు. సరైన టైంలో ఎరువులు ఎయ్యక దిగుబడి వచ్చేది కాదు. పెట్టుబడి కూడా రాక భూములను పడావు ఉంచేది. తెలంగాణ వచ్చినంక కేసీఆర్ 24గంటల కరెంటుతోపాటు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచారు. ఎకరాకు రూ.10వేల పెట్టుబడి ఇచ్చిండు. రైతుకు ఏమన్న జరిగే కుటుంబానికి రూ.5లక్షలు బీమా ఇచ్చి ఆదుకుంటాండు. కాంగ్రెస్ వస్తే వాళ్లు మూడు గంటల కరెంటే ఇస్తరు. వాళ్లను రైతులు ఎవరూ నమ్మరు. మళ్లా కేసీఆర్ వస్తేనే రైతులు బాగుపడుతరు.

***- ఎడవెల్లి లింగారెడ్డి, పెంబర్తి గ్రామం, హసన్‌పర్తి మండలం***

## కాంగ్రెస్ వస్తే వ్యవసాయం ఖతం



ఐనవోలు: కాంగ్రెస్ నాయకుల మాటలు వింటుంటే పాత రోజులు గుర్తుకొస్తున్నాయి. రాత్రిపూట బాయిల కాడికి పోయి కరెంటు కోసం పడిగాపులుగాచే వాళ్లం. మోటర్లు పెట్టేందుకు పోతే ఇంటికి తిరిగి వచ్చేది గ్యారెంటీ లేకుండే. అప్పులు తెచ్చి ఎవుసం చేసేవాళ్లం కరెంటు సరిగా లేక, పంట సరిగా పండక రైతులు ఆత్మహత్యలు చేసుకునే వాళ్లు. తెలంగాణ ప్రభుత్వంలో కరెంటు కష్టాలు పోయి తొమ్మిదేండ్లు అవుతున్నది. కాంగ్రెస్ నాయకులు ప్రచారంలో చెప్పే మాటలు వింటుంటే రైతులు సంతోషంగా ఉండడం వారికి ఇష్టం లేదనిపిస్తోంది. కాంగ్రెస్ వస్తే తెలంగాణ ఇప్పుడు సాధించిన అభివృద్ధి అంత ఖతం పట్టించి, వ్యవసాయ పని కూడా ఖతం చేస్తారు.

***- కోల కృష్ణయ్య, రైతు, పెరుమాండ్లగూడెం***



## అరూరి రమేశ్ గెలుపు కోసం బైక్‌ర్యాలీ

హసన్‌పర్తి, నవంబర్ 22: బీఆర్ఎస్ అభ్యర్థి అరూరి రమేశ్ గెలుపు కోసం గ్రేటర్ 66వ డివిజన్ హసన్‌పర్తిలో పార్టీ డివిజన్ అధ్యక్షుడు పాపిశెట్టి శ్రీధర్ ఆధ్వర్యంలో బుధవారం బైక్ ర్యాలీ తీశారు. ముఖ్యఅతిథిగా ఉమ్మడి వరంగల్ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ అరూరి విశాల్ హాజరై ప్రారంభించారు. అనంతరం పలు కాలనీల్లో యువకులతో కలిసి బైక్‌పై ర్యాలీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే అరూరి రమేశ్ ప్రజల మధ్యే ఉంటూ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసిన నాయకుడని తెలిపారు. మూడోసారి రమేశ్‌ను ఆశీర్వదించి భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఆత్మ చైర్మన్ కందుకూరి చంద్రమోహన్, పిట్టల కుమారస్వామి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వీసం సురేందర్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు శ్రీకాంత్, బోడ యుగేందర్, బొక్క కుమార్, వల్లాల యాదగిరి, శ్రావణ్, సాయి, భిక్షపతి పాల్గొన్నారు.



హసన్‌పర్తిలో బైక్ ర్యాలీలో అరూరి విశాల్, బీఆర్ఎస్ నాయకులు

## చెరువులో దూకి వివాహిత ఆత్మహత్యా యత్నం

### కాపాడిన బ్లూ కోల్ట్స్ కానిస్టేబుల్

హసన్‌పర్తి, నవంబర్ 22: మండల కేంద్రంలోని పెద్ద చెరువులో దూకి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన ఓ వివాహితను హసన్‌పర్తి బ్లూ కోల్ట్స్ కానిస్టేబుల్ బుధవారం రక్షించాడు. సీఐ తుమ్మ గోపి కథనం ప్రకారం.. హనుమకొండకు చెందిన ఓ వివాహిత ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో భర్తతో గొడవపడి ఉదయం చెరువు వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్నది. ఈ సమయంలో స్థానికులు 100కు డయల్ చేయగా విధులు నిర్వర్తిస్తున్న బ్లూ కోల్ట్స్ కానిస్టేబుల్ రత్నాకర్ తక్షణమే స్పందించాడు. చెరువులో దూకేందుకు సిద్ధపడుతున్న ఆమెను రక్షించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఆమెకు కానిస్టేబుల్ కౌన్సెలింగ్ నిర్వహించి భర్తకు అప్పగించారు. మహిళలను రక్షించిన బ్లూ కోల్ట్స్ కానిస్టేబుల్ రత్నాకర్‌తోపాటు తక్షణమే స్పందించిన సీఐ గోపి, హెడ్ కానిస్టేబుల్ మల్లికార్జున్‌ను వరంగల్ సీపీ అంబర్‌కిశోర్‌ఝా అభినందించారు.

## పౌరుడి అస్థిత్వానికి ప్రతీక.. ఓటు

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 22: పౌరుడి అస్థిత్వానికి ప్రతీక ఓటు అని, ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని, ప్రజాస్వామ్య దేశంలో ప్రతి ఓటరూ కాపలాదారుడేనని జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ అశోక్ పరికిపండ్ల అన్నారు. ఆరోగ్యమిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో హనుమకొండ ఆదర్శకాలనీలో జరిగిన ఓటరు చైతన్య కార్యక్రమంలో ఆయన పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ఓటు హక్కు సద్వినియోగం కాకపోతే ప్రజాస్వామ్యానికే ప్రమాదమని, ప్రలోభాలకు లొంగకుండా వినియోగించుకోవాలన్నారు. ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వేణు, సీనియర్ సిటిజన్స్ జిల్లా నాయకులు తేరాల యుగంధర్, విశ్రాంత ఆచార్యులు దువా శేఖరయ్య, గాజుల సత్యరాజు, సుజాత, విద్యావతి, సువర్ణ పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి

హసన్‌పర్తి, నవంబర్ 22 : విద్యుత్ షాక్‌తోఎద్దు మృతిచెందిన ఘటన పెంబర్తిలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని పెంబర్తికి చెందిన కొయ్యడ ఐలయ్య మంగళవారం సాయంత్రం ఎడ్లను మేత కోసం వదిలేశాడు. మేత మేస్తున్న క్రమంలో ఓ ఎద్దు ట్రాన్స్‌ఫార్మర్‌కు తగడంతో విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృత్యువాత పడింది. ఎద్దు విలువ రూ.80వేలు ఉంటుందని బాధితుడు చెప్పాడు. కాగా, విషయాన్ని విద్యుత్ ఏఈ తరుణ్‌కు చెప్పగా, చేరుకొని వివరాలను సేకరించారు.


# కాంగ్రెస్, బీజేపీకి ఓటేస్తే ఢిల్లీదే పెత్తనం

- ఆగం చేసే పార్టీలు మనకొద్దు
- బీఆర్ఎస్‌తోనే భద్రత, భరోసా
- వర్ధన్నపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అరూరి రమేశ్
- శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, మేయర్ గుండు సుధారాణితో కలిసి 44, 45వ డివిజన్లలో ప్రచారం

మడికొండ, నవంబర్ 22: కాంగ్రెస్, బీజేపీలకు ఓటు వేస్తే తెలంగాణపై ఢిల్లీ పెత్తనం కొనసాగుతుందని బీఆర్ఎస్ వర్ధన్నపేట ఎమ్మెల్యే అభ్యర్థి అరూరి రమేశ్ అన్నారు. గెలిచినంక ఆగం చేసే పార్టీలు మనకొద్దని, బీఆర్ఎస్ పార్టీతో భద్రత, భరోసా ఉంటుందని అన్నారు. గ్రేటర్ 44, 45వ డివిజన్‌ల పరిధిలో గల కడిపికొండ, అయోధ్యపురం, రాంపేట, కుమ్మరిగూడెం, ఇందిరమ్మ కాలనీ, భట్టుపల్లి, కొత్తపల్లి, అమ్మవారిపేట, జక్కులొద్ది, నక్కలపల్లి, లక్ష్మీపురం, అల్లీపురం, పెన్షన్‌పూర్, మామూనురు, తిమ్మాపురం గ్రామాల్లో బుధవారం ఆయన శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, మేయర్ గుండు సుధారాణితో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరూరి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గెలిస్తే సీఎం అయ్యేదెవరో తెలియని పరిస్థితి ఉందన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఢిల్లీలో చేతులు కట్టుకొని నిలబడటం తప్ప చేసేదేమీ ఉండదన్నారు. కాంగ్రెస్ పార్టీకి 11సార్లు అవకాశం ఇస్తే రాష్ట్రాన్ని ఆగం చేశారని, ప్రజలను ఏనాడూ పట్టించుకోలేదని విమర్శించారు. ఆ పార్టీకి ఓటేస్తే మళ్లీ చీకటి రోజులు వస్తాయని, యాభై ఏళ్లు వెనక్కి పోతామన్నారు. అందరం ఒక్కటై ఢిల్లీ గద్దెల నుంచి తెలంగాణను కాపాడుకుందామని తెలిపారు. ఒక్క అవకాశం ఇవ్వమని అడుగుతున్న కాంగ్రెస్ నాయకులు 50 ఏళ్లలో 11 సార్లు అవకాశం ఇస్తే ఏం వెలగబెట్టారని ప్రశ్నించారు. మళ్లీ అవకాశం ఇస్తే ఎరువుల కోసం దుకాణాల ముందు నిలబడాలా? కరెంటు కోసం అర్ధరాత్రులు పొలాల కాడ పడుకోవాల్నా? ఇలాంటి దరిద్రపు పాలన మనకు మళ్లీ కావాలా? అని నిర్ణయించుకోవాలని కోరారు. వారెంటీ లేని కాంగ్రెస్ పార్టీ గ్యారెంటీలను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. రైతుబంధు, రైతు బీమా, కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్ వంటి అనేక సంక్షేమ పథకాలను నియోజకవర్గంలో పార్టీలకు అతీతంగా అందించినట్లు తెలిపారు. వ్యాగన్ పరిశ్రమల్లో భూములు కోల్పోయిన రైతులకు అండగా ఉంటామని, అధికారంలోకి రాగానే ఆదుకుంటామని హామీ ఇచ్చారు. విలీన గ్రామాలకు పెద్ద ఎత్తున నిధులు తీసుకోవచ్చి అభివృద్ధి చేసినట్లు తెలిపారు. నియోజవర్గంలో పదేళ్లుగా ప్రజల కుటుంబ సభ్యుడిగా ఉన్నానని పేర్కొన్నారు. శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో అభివృద్ధిని చూసి ఓటు వేయాలని సూచించారు. మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం మహిళలకు అధిక ప్రాధాన్యం ఇచ్చిందన్నారు.



వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిస్తున్న అరూరి




రోడ్ షోలో డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, చిత్రంలో ఎమ్మెల్యే అభ్యర్థి అరూరి

### 'అరూరి'కి ఘనస్వాగతం

డివిజన్ పరిధి గ్రామాల్లో ప్రచారం చేసేందుకు వచ్చిన అరూరికి స్థానిక నాయకులు ఘనస్వాగతం పలికారు. మహిళలు బతుకమ్మలు, బోనాలు, కోలాటం, మంగళ హారతులతో స్వాగతించారు. జిల్లా రైతుబంధు అధ్యక్షురాలు ఎల్లావుల లలితాయాదవ్, కార్పొరేటర్లు ఇండ్ల నాగేశ్వర్‌రావు, ఈదురు అరుణ, విక్టర్, జిల్లా అధికార ప్రతినిధి ఉదయ్ కిరణ్, పాక్స్ చైర్మన్ ఊకంటి వనంరెడ్డి, మాజీ కార్పొరేటర్ బస్కె శ్రీలేఖ, బస్కె కృష్ణ, రమేశ్, జైపాల్‌రెడ్డి, స్పందన్, బొమ్మినేని రాంచంద్రారెడ్డి, గాదెం యాదగిరి, ఉల్లెంగుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## భీమారంలో ఇంటింటా ప్రచారం

హసన్‌పర్తి, నవంబర్ 22 : గ్రేటర్ 55వ డివిజన్ పరిధిలోని భీమారంలో స్థానిక కార్పొరేటర్ జక్కు రజితా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి అరూరి రమేశ్ గెలుపు కోసం బుధవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ మ్యానిఫెస్టోను ప్రజలకు వివరిస్తూ కారుగుర్తుకు ఓటువేసి అరూరిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు అటికం రవీందర్, ప్రధాన కార్యదర్శి నాయకపు శ్రీనివాస్, ఎర్రగట్టు గుట్ట ఆలయ చైర్మన్ చింతల లక్ష్మణ్, డివిజన్ ఉపాధ్యక్షుడు రాయికంటి సుధాకర్, 65 డివిజన్ ఇన్‌చార్జి కరుణాకర్, గ్రామ అధ్యక్షుడు రాయికంటి సురేశ్ పాల్గొన్నారు.



ఇంటింటా ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ జక్కు రజితా వెంకటేశ్వర్లు



కొంకపాకలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

## 'అరూరి'ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

పర్వతగిరి, నవంబర్ 22: బీఆర్ఎస్ అభ్యర్థి అరూరి రమేశ్‌ను మూడోసారి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరుతూ కొంకపాకలో బుధవారం గడపగడపకు తిరిగి ప్రచారం నిర్వహించారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఎన్నికల మ్యానిఫెస్టోలోని నూతన పథకాల గురించి వివరించారు. పల్లెల్లో జరిగిన అభివృద్ధిని చూసి అరూరికే ఓటు వేయాలని కోరారు. పీఏసీఎస్ వైస్ చైర్మన్ మధుసూదన్‌రావు, ఎంపీటీసీ కర్మిల్ల మోహన్‌రావు, సర్పంచ్ వర్కాల రమేశ్, పార్టీ గ్రామ అధ్యక్షుడు వివేక్ కుమార్, నాయకులు బీ ఎల్లాగౌడ్, రఘుపతిరావు, డాక్టర్ రాజశేఖర్, బొక్కల బాబు, బొంత దుర్గయ్య, బెల్లం కుమార్, మ్యాక రవి, రఘుపతి, లింగయ్య, కనుకయ్య పాల్గొన్నారు.